# ఆకర్షణ లేని అమ్మాయి

ఈ మధ్య మా బంధు వొకడు తన కోసం ఏర్పాటయిన పిల్లను చూసుకుని వచ్చి, 'అంతా బాగానేవుందిగాని నాకా పిల్ల ఆట్టే నచ్చలేదు' అనిచెప్పి ఏర్పాట్లన్నీ భగ్నం చేశాడు. ఈ సంగతి నా చెవిన పడగానే నేను వాణ్ని 'మళ్ళీ వెళ్ళి ఒకసారి చూసిరా. వెళ్ళిన వాడివి రెండు రోజులుండి మరీరా. అప్పటికీ నీకు పిల్ల నచ్చక పోతే మానెయ్యి' అని తిప్పి పంపాను.

నా నమ్మకం వాడా పిల్లను తప్పక చేసుకుంటాడనే.

ఎందుకంటే.........నా కళ్ళ ఎదటే జరిగింది.

దేవకి అనే కన్నడం పిల్ల. ఏమీ బాగుండేది కాదు. సన్నగా ఎండిపోయి కళ్ళల్లో ప్రాణాలున్నట్టుండేది. పలచని జుట్టూ, పొట్టి జడా, నవ్వినా సరిగా కనపడనంత సన్నని పళ్ళు.

మా ఆఫీసున్న బిల్డింగులో అదే భాగంలో వున్న మరో ఆఫీసులో స్టెనోగ్రాఫరుగా ఉండేది. బొంబాయిలో మనుష్యులకే గాక ఆఫీసులకూడా ఇళ్ళ కరువు రావటం మూలాన మా వింగులో నాలుగాఫీసులు. ఈ నాలుగాఫీసుల్లోనూ కలిసి నలురు రాడ పిల్లలు – స్టెనోగ్రాఫర్లయితేనేం, టెలిఫోను పిల్లలయితే నేం. అందులో దేవకి ఒకతె.

దేవకిది అసలు ధార్వా రనుకుంటాను. చిన్నతనం నుంచీ బొంబాయిలోనే చదివింది. మహారాష్ట్రం ధారాళంగా మాట్లాడేది. ఇంటరు [1] పాసయి యుద్ధం[2] రాగానే షార్టుహేండూ, టైపూ నేర్చుకుని ఈ ఉద్యోగం సంపాదించింది.

ఎవరూ దేవకి కేసి చూసేవాళ్ళు కారు, పలకరించే వాళ్ళూ కారు. పలకరిస్తే పలుకుదామనే ధోరణిలో వుండేది కాదు. ఆమెలో ఆకర్షణ లేకపోవటానికి యిదే ఒక పెద్ద కారణం. మిగతా ఆడపిల్లలు పైకి ఎంత డాబుగా, బెట్టుగా కనిపించినా మగప్రాణి పలకరిస్తేచాలు చప్పున మొహాలు తెరిచి, "యస్ ప్లీజ్?" అనే వాళ్ళు ఆత్రంగా.

---

1. ఇంటరు : స్కూలు ఫైనలు తర్వాత ఆ రోజుల్లో రెండు సంవత్సరాల చదువు (ఎఫ్. ఏ)

2. యుద్ధం : రెండవ ప్రపంచ యుద్ధం ప్రస్తావన.

లంచికి దేవకి ఒక్కతే బయటికి వెళ్ళేది. మిగతా ఆడవాళ్ళు లంచి తెప్పించుకుని మగవాళ్ళ లంచి టేబిలు దగ్గిరే మూడు ఖాళీలు దొరికినప్పుడే ఏకంగా కూచుకుని తినేవాళ్ళు.

దేవకిని లంచికి తీసుకుపోవటానికి ఒక పెద్ద మనిషి వచ్చేవాడు. అతనికి నలభై ఏళ్ళయినా వుంటై. పొట్టిగా గుమ్మటం లాంటి మనిషి. మాడుకు వెనకగా కొంచెం బట్టతల. పేరు కరండే.

అతను మహారాష్ట్రుడు గనక, ఆమెకు చుట్టమై ఉండటానికి వీల్లేదు. ఆరా తియ్యగా కరండే భార్యకు దేవకి తల్లిదండ్రులు బాగా తెలిసినవాళ్ళనీ, దేవకి వాళ్ళ ఇంట్లోనే వుంటున్నదనీ బయటపడింది. కరండే దేవకికి గార్డియన్ అన్నమాట. దాదరు నుంచి ఇద్దరూ రైలెక్కి వచ్చేవాళ్ళు, తిరిగి రైలెక్కి వెళ్ళే వాళ్ళు, కలిసి లంచికి వెళ్ళేవాళ్ళు.

కరండే కూడా ఎవరితోనూ మాట్లాడేవాడు కాడు. నాతో కలిసి పనిచేసే దినకర్, కరండే తమ్ముడితో చాలా ఏళ్ళు కలిసి చదువుకున్నాట్ట, దినకరును ఎరగ నట్టు నటించేవాడు, ఒక్కసారయినా పలకరించలేదు.

"దేవకి కూడా తెలుసునా?"అని అడిగాను.

"నాకు తెలీదు. నేనెక్కడో గిర్గాంలో వుంటాను. అయినా ఆ మనిషి తెలిసేం తెలియకేం?" అన్నాడు దినకర్.

దినకర్ చాలా అందంగా ఉంటాడు. హాకీలో ఆరితేరిన చెయ్యి. ఏటా ఏ అయిదారువేలో వచ్చే ఆస్తివుంది. వాడు వేళాకోళానికి ఉద్యోగం చేస్తున్నాడు నన్నడిగితే.

ముప్పై చేరబడుతున్నా పెళ్ళి చేసుకోవేమని వాణ్ణి అడిగితే వాడు, "నాకు కావలసిన మనిషి పుట్టలేదు" అనేవాడు. ఎంతో అందగత్తెలనీ, చదువుకున్నవాళ్ళనీ, అద్భుతంగా పాడేవాళ్ళనీ నిరాకరించాట్ట. వాడిమీద ఆంగ్లోయిండియను పిల్లలిద్దరూ కన్నేసే వుంటారు. వాళ్ళే వాడితో హెచ్చు సరసాలాడేవాళ్ళు. మరీ టెలిఫోను పిల్ల వాడాఫీసుకు రాగానే "నీకోసం ఎవరోపిల్ల టెలిఫోన్ చేసింది" అని ఎగతాళిచేస్తూ ఉండేది.

దేవకి మాత్రం ఎన్నడూ వాడికేసి కన్నెత్తి అయినా చూసిన పాపాన పోలేదు.

ఒక ఆదివారంనాడు ఆంగ్లోయిండియను పిల్లలు ఎలిఫెంటాకు ప్రయాణం పెట్టుకుని వాళ్ళతో సావాసంగా ఉండే వాళ్ళందర్నీ అడిగారు. దినకర్‌గాణ్ణి కూడా అడిగారు. వాడు సరే నన్నాడు. ఆ పార్టీకి దేవకి కూడా వెళుతున్నట్టు తెలిసింది. శని వారంనాడే ఈ ఏర్పాటంతా ఐంది. నన్నెవరూ రమ్మననూలేదు నేను రానననూ లేదు. కాని శనివారంనాడు ఆఫీసుటైము అయిపోతుండగా దినకరు నా దగ్గిరికొచ్చి "రేపు ఎలిఫెంటాకు నువు కూడా రాకూడదా?" అన్నాడు.

"నన్నెవరూ పిలవలేదు—అయినా ఈ ఆంగ్లోయిండియన్ ముఠాతో మనం దేనికి ?" అన్నాను.

"అట్లా కాదు. నువు కూడా రా. దానిక్కారణం ఉంది, చెబుతాను" అన్నాడు.

ఆ కారణం ఏమిటంటే ఈ పార్టీ కొంచెం రౌడీపార్టీ. గ్రామఫోనూ, తాగేటందుకు జిన్నూ, రమ్మూ, బ్రాందీ తీసుకుపోతున్నారు. దేవకి మర్యాదకు ఒప్పుకుంది గాని తీరా ఒంటరిదైపోయి కంగారు కావచ్చు. ఆమెకి మగవాళ్ళు ఒకరి కిద్దరు తోడుండటం మంచిది.

ఆఖరికి దినకరన్నంతా అయింది. దేవకి వచ్చింది, వెంట తిండి కూడా తెచ్చుకుంది. నాకు దినకరుకూ వాడే తిండి తెచ్చాడు. తీరా దేవకి తెచ్చుకున్న పదార్థాలు చూస్తే అవి ఏ హోటల్లోనో కొని తెచ్చిన కిందటిరోజు సరుకుగా కనిపించింది. మేము ముగ్గురము తప్ప మిగతా అందరూ ఆంగ్లోయిండియనులే. ఎక్కడో బీరు కూడా తెచ్చారు. గ్రామఫోను పెట్టి తెచ్చిపెట్టుకున్న సాహసంతో చాతనయీ కాకుండా డాన్సులు చెయ్యసాగారు. వాళ్ళ సంభాషణ మటుకు మరీ దుర్భరంగా వుంది. మగవాళ్ళంతా ఏ తుక్కు పత్రికల్లోవో బూతు హాస్యాలు చెప్పటమూ ఆడవాళ్ళు విరగబడి నవ్వటమూ ; అందరూ ఒకరి నొకరు జానీ, నాన్సీ, సుజీ, పింకీ, టప్పీ అని స్వతంత్రంగా పిలుచుకోవటమూ; మితిమించి వెళుతున్నామేమో అని కొంతసేపూ, అనవసరంగా బిడియపడి పొందదగినంత సరదా పొందటం లేదేమోనని కాస్సేపూ ఆదుర్దాపడటమూ వగైరాలతో మాకు మొహం మొత్తింది.

దేవకి నాకేసి, దినకరుకేసి తెగ చూస్తున్నది.

"మనం ఎటయినాపోయి ఏదైనా చూద్దాం" అన్నాడు దినకర్. మేం లేవగానే దేవకి కూడా లేచింది—అంటే దినకర్ గాడు చిన్నగా "యా" అన్నాడు.

ఆంగ్లోయిండియనుల బెడద వదిలించుకుని గుళ్లన్నీ తిరిగి తురకలు చెక్కేసిన శైవ విగ్రహాలన్నీ చూశాం. పక్కనే నూతిదగ్గర కూచుని తిళ్ళమూటలు విప్పాం.

దేవకి తెచ్చుకున్న తిండి చూడగానే దినకరు నిర్ఘాంతపోయి. "అది కూడా ఇచ్చెయ్యండి. అందరి పదార్థాలూ కలిపి తిందాం "అన్నాడు. దేవకి సంకోచిస్తూ ఇచ్చింది.

"ఇవి ఇంట్లో చేసినవి కావే" అన్నాడు దినకరు కుండపగలేసి.

"కావు. ఉదయం హోటల్లో కొన్నాను.... నేను రావటానికి కరండే ఒప్పుకోలేదు. మొండితనంచేసి వచ్చాను. ఇన్నేళ్ళనించీ యిక్కడుంటున్నాను. ఎలిఫెంటా ఎన్నడూ చూడలేదు. అందుకని బయల్దేరాను. బయల్దేరితే—" దేవకి మాట పూర్తి చెయ్యకుండానే తిండి తినసాగింది.

ఆమె చెప్పింది కొంచెమే అయినా మేం చాలా ఊహించుకున్నాం. ఆమె మొహంలో పట్టు చెల్లించుకున్న సంతోష చిహ్నాలు లేవు. జరిగినంత ఇంకా జరగ

బోతున్నదని ఆమెకు తెలిసే ఉండాలి. ఆమె తిరిగి వెళ్ళగానే ఆ కరండే మరో పంచాయితీ చేస్తాడు. అందుట్లో యీ వచ్చినపార్టీ ఎటువంటిదో తెలిస్తే చెప్పనే అక్కర్లేదు.

మేం వద్దంటున్న కొద్దీ నూతిలోనుంచి దేవకి తానే నీళ్ళుతోడి మాచేత తాగించింది. మాతోపాటు తనూ గిన్నెను కడిగి కారీయరులో పెట్టింది.

దేవకి అనాకారి మనిషనేమాట నేను మనస్సులో కూడా అనుకోనని తీర్మానం చేసుకున్నాను.

*　　*　　*

సోమవారం ఉదయం ఆఫీసుకు వస్తూనే దేవకి దినకర్ దగ్గిరికి వచ్చి, "లంచి టైములో కరండే వచ్చినప్పుడు నిన్న మనం ఏమేం చేశామో చెప్పండి దయచేసి" అన్నది.

దినకర్ మొహం జేవురించింది. "చెబుతాను" అన్నాడు భీకరంగా.

కాని లంచిటైముకు కరండే రాలేదు. అరగంట గడిచిపోవటమూ, దేవకి వెళ్ళిపోవటమూ చూసి దినకర్ దేవకి దగ్గిరికి వెళ్ళి, "లంచికి పోదామా?" అన్నాడు.

దేవకి దిగ్భ్రమ చెందిన దానల్లే కుర్చీలోనించి లేచింది. ఇద్దరూ కలిసి వెళ్ళిపోయినారు.

ఆ తరవాత జరిగినది నాకు దినకరే చెప్పాడు. వాడా సాయంకాలం దేవకి వెంట కరండే యింటికివెళ్ళాట్ట. దేవకిని వెనకేసుకుని కరండేతో పెద్ద పోట్లాట పోట్లాడాట్ట. కరండే చాలా ఫోజులు పెట్టాడు. దేవకి శీలానికి తను బాధ్యుడని, దేవకి తన అనుమతి లేకుండా అటువంటి పార్టీకివెళ్ళి ఉండనే కూడదనీ, ఊళ్ళోవుండే రౌడీ వెధవల సాక్ష్యం తనకు అవసరం లేదనీ, తన ఆజ్ఞ పాలించటానికి కష్టంలేని దేవకి తనఇంట్లో తన కాపలాకింద ఉన్నట్టు నటిస్తూ పేరు ప్రఖ్యాతులు గల తన కుటుంబానికి కళంకం తెచ్చి ప్రయోజనం లేదనీ ఏమేమిటో పేలాట్ట.

దినకరు ఉగ్రుడైపోయి, "అవును, ఇటువంటి చెడిపోయిన అమ్మాయిలు మీ ఇంట్లో వుంటే అపఖ్యాతి. మా అమ్మకూ నాన్నకూ పేరు ప్రతిష్టలు లేవు. అందు చేత దేవకి కావాలంటే మా యింటికి రావచ్చు." అన్నాట్ట.

ఆ మాట వినగానే దేవకి ఏడిచిందట.

ఏమైనా అప్పటికప్పుడే టాక్సీ తెచ్చి దినకరు దేవకిని తన యింటికి తెచ్చేశాడు.

సరిగా మూడునెల్లు తిరిగేలోపల దేవకి ఎంత మారిపోయిందో చెప్పలేను. మొహంలో ఎన్నడూలేని కాంతి వచ్చింది. మనిషికి కొద్దిగా ఒళ్ళు పెట్టింది. నడకలో వెనక ఎన్నడూలేని చలాకీ కనిపించింది. వెనకటిలాగా కాకుండా దాదాపు రోజూ సినిమాలకో, పార్కులకో దినకరు వెంట షికారు వెళ్ళసాగింది. శ్రద్ధగా జుట్టుకూ ఒంటికీ పోషణ చేసుకుని అందమైన చీరలూ కట్టుకోసాగింది.

ఇదంతా చూసిన మీదట ఒకనాడు దినకర్ నాతో తనూ దేవకీ పెళ్ళి చేసుకో బోతున్నట్టు చెబితే నాకాశ్చర్యం కలగలేదు. కాని, ఒక్క అనుమానం మాత్రం నన్ను పీడించింది.

"అరే, దినకర్, నువు దేవకిని పెళ్ళి చేసుకోమని అడిగే అవకాశం ఎట్లా వచ్చింది ?" అన్నాను. వాడూ శ్రద్ధగా కూచుని ఆలోచించి ఇంతకంటె మంచి భార్య దొరకదని తేల్చుకుని ఆ మీదట మంచి ముహూర్తం చూసుకుని దేవకితో, "నన్ను పెళ్ళాడుతావా ?" అని అడిగి ఉంటాడని ఎంతమాత్రమూ నమ్మలేకపోయినాను.

"అరే, ఏం చెప్పేది ?....మా యింటికొచ్చిన రెండోనాడో, మూడోనాడో దేవకి సీరియస్‌గా నాకు కృతజ్ఞత చెప్పటానికి ప్రయత్నం చేసింది. పాపం ఎన్ని సార్లు రిహార్సు చేసుకుందోగాని తీరా నోట సరిగా మాటలు రాలేదు. ఆ సందిగ్ధ వస్థలో ఆమెకు అడ్డం తగలటం చాలా భూతదయగల పనిగా తోచింది. కాని ఎట్లా ఆపటం ? ఏమీ తోచక చప్పున దగ్గిరికి లాక్కుని చాలాసేపు ముద్దు పెట్టు కున్నాను....అంతే ; ఇక పెళ్లాడక తప్పలేదు."

"పశ్చాత్తాప పడవు కద ?"

"ఆ క్షణంలో ముద్దు పెట్టుకున్నందుకు పశ్చాత్తాప పడితే యిక నేనేం మనిషిని ?" అన్నాడు దినకరు.

దేవకి సుఖపడుతుందని నాకు తెలుసు.

ముద్రణ :

రూపవాణి, మే 1945